

# కథ

# ఆరాధన

డా॥ పి. కె. జయలక్ష్మి

"హాయ్ రాధాంటీ! హౌఆర్యూ? "ప్రేమగా పలకరిస్తూ చనువుగా ఇంట్లోకి వచ్చాడు అరుణ్''. ఏం నాన్నా మరీ ఇర్రెగ్యులర్‌గా తయారయ్యావు? క్లాసులకి నామం పెట్టేస్తున్నావు ఫ్రీక్వెంట్‌గా..? క్యా బాత్‌హై?" అన్నాను కళ్ళెగరేస్తూ.

"బిజీ ఆంటీ, డాడీకి ఈ మధ్య క్యాంపులు ఎక్కువై ఆరోగ్యం పాడయింది. సో, ఆఫీస్ నేను చూస్కోవాల్సి వస్తోంది, రేపట్నించి రెగ్యులర్లీ రెగ్యులర్ ఒకేనా, ఇంతకీ మీ రేకీ క్లాసులు ఎలా అవుతున్నాయ్? నా కంప్యూటర్ క్లాసులా కాదు కదా!" అన్నాడు నవ్వుతూ.

"నోవే, నేనేదైనా స్టార్ట్ చేస్తే అంతు చూడాల్సిందే. ఆరంభింతురు ఉత్తముల్" అంటూ మొదలెడితే, "బాబోయ్ ఆంటీ క్లాసు పీకకండి, వస్తా బాయ్, అంటూ నిష్క్రమించిన అరుణ్‌ని చూస్తూ ఉండిపోయాను. నేను సైకాలజీ లెక్చరర్‌గా ప్రైవేట్ కాలేజ్‌లో పని చేస్తున్నాను. మా శ్రీవారికి పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగం. పిల్లలు చిన్న క్లాసులు దాటి హైస్కూల్‌కి వచ్చారు. సాయంత్రం కంప్యూటర్ క్లాసులు చెప్తూ ఉంటా. మధ్యాహ్నం రెండు కల్లా కాలేజ్ నుంచి రాగానే ఫ్రీ టైం సద్వినియోగం చేస్తూ కౌన్సిలింగ్ చేస్తూ ఉంటాను ఇంకా రేడియో ప్రోగ్రామ్‌లు, సాహితీ సమావేశాలు, అడపాదడపా సృజనాత్మక వ్యాసంగం మొదలైన వాటితో బిజీగా ఉంటాను. మధ్యలో యోగా అని, రేకీ అని చేస్తూ ఉంటా. సాయంత్రం బ్యాచ్ కంప్యూటర్ స్టూడెంట్ అరుణ్. మూడు నెలల కోర్సులో చేరాడు. నెల వరకు బానే వచ్చాడు. ఇదిగో ఈమధ్య సరిగ్గా రావట్లేదు, ఆ కుర్రవాడికి నేనుంటే ఏదో అడ్మిరేషన్". ఇన్ని పన్లు ఎలా చేస్తారాంటీ? డోంట్ యూ ఫీల్ టయర్డ్?" అంటాడు. ఎప్పుడైనా క్లాస్ అయిపోయాక నేను ఫ్రీగా ఉంటే తన ఫ్రెండ్స్ గురించి, ఫీచర్ గురించి మాట్లాడుతూ ఉంటాడు. ఒకరోజు తన ప్రాక్టీసు అయ్యాక లోపలికి వచ్చేసరికి నేనెవరికో కౌన్సిలింగ్ చేస్తూ ఉండడంతో ప్రక్క రూమ్‌లోనుంచి వింటూ కూర్చున్నాడు. వాళ్ళు వెళ్ళగానే నా రూమ్‌లోకి వచ్చి "వావ్ ఆంటీ, ఎంత బాగా చెప్పారో! నిజంగా ఎలాంటి వారైనా మీ మాటలువిని మారి తీరాల్సిందే. మీకింత పేషన్స్ ఎలా వచ్చింది? యూ ఆర్ రియల్లీ గ్రేట్" అంటూ ప్రశంసల వర్షం కురిపించాడు. "నేను చదువుకున్న చదువు ఇదేగా మరి!" అని నవ్వేశాను.

ఆరు నెలలు గడిచిపోయాయి. అడపాదడపా రెండు నెలలు వచ్చిన అరుణ్ తర్వాత నుంచి అస్సలు రావడం మానేశాడు. ఆమధ్య రెండు, మూడు సార్లు ఫోన్ చేస్తే ఫాదర్‌కి బాలేదని, బోంబేలో ట్రీట్‌మెంట్ అని చెప్పాడు. నేను కూడా ధైర్యం చెప్తూ జాగ్రత్తలు చెప్పాను. ఒకరోజు న్యూస్ పేపర్‌లో ఆయన పోయినట్లు చూసి చాలా షాకయ్యాను. ఫోన్ చేసిన అరుణ్ నుంచి రెస్పాన్స్ లేదు. తర్వాత దాదాపు రెండు నెల్లకి అరుణ్ కలిశాడు. చిక్కిపోయాడు, డిప్రెస్డ్‌గా కూడా ఉన్నాడు. ఆరోజు ఆదివారం కావడంతో నేను ఇంట్లోనే ఉన్నాను. శ్రీవారు పిల్లల్ని తీసుకుని బైటకి వెళ్ళారు. ఎలా పలకరించాలో తెలియలేదు. "సారీ అరుణ్, డాడీ విషయం తెల్సి చాలా బాధపడ్డాను. మమ్మీ ఎలా ఉన్నారు? ధైర్యం చెప్పాల్సిన బాధ్యత నీదే. యూ హావ్ టు కమ్ అవుట్ ఆఫ్ ఇట్" అన్నాను లాలనగా. తల దించుకొని వుండడంతో ముఖంలోని ఫీలింగ్స్ కన్పించలేదు.

"డాడీ పోయిన దానికంటె అమ్మకి అన్యాయం చేశారని నాకు బాధగా వుంది ఆంటీ", అన్నాడు శూన్యంలోకి చూస్తూ. "ఏం మాట్లాడుతున్నావు, అరుణ్?" అన్నా ఆశ్చర్యంగా.

"అవునాంటీ! డాడీలో మాకు తెలియని రహస్యాలుంటాయని అనుకోలేదు. ఆయన పోయాక కొన్ని విషయాలు బైటపడ్డాయి. ఎవరినో ఈ మధ్యకాలంలోనే ప్రేమించారంట. చూడండి ఈ డైరీ. అంతా ఆమె గురించే! 'ధనూ'ట! అమ్మని ప్రేమించి పెళ్ళి చేసుకుని ఎలా సాధ్యం ఆంటీ! ఇంకొకళ్ళని ప్రేమించడం? మీరే చెప్పండి. నాకెందుకో ఆయన నచ్చడం లేదాంటీ! సరే నేను మళ్ళీ కలుస్తాను. ఈడైరీ మీ దగ్గరే ఉంచండి అంటూ సీరియస్‌గా లేచి వెళ్ళిపోయాడు.

"ధనూ! "ఆసక్తిగా, ఆశ్చర్యంగా డైరీ తెరిచాను. జనవరి 2 యోగా క్లాసుకు చాలా కాలం తర్వాత వెళ్ళాను. ఇంకా స్టార్ట్ అవ్వలేదు. పాత మిత్రులతో మాట్లాడుతూ ఉండగా తటిల్లతలా వచ్చిన ఆమెను చూస్తూ ఉండిపోయాను. అందరిని "హాలో గుడ్మాణింగ్!" అంటూ నవ్వుతూ పలకరిస్తూ నావైపు ఆశ్చర్యంగా చూసింది. ఎందుకో తనని చూస్తే ఎప్పట్నించో తెలిసిన అమ్మాయిలా అన్పించింది. నాలుగు, ఐదు రోజుల డైరీలో ఆమె వర్ణనే! 10 జనవరి. ధైర్యం చేసి నేను పలకరించాను తనూ బాగానే మాట్లాడింది. ఎప్పుడైనా క్లాసుకి ముందు వస్తే జనరల్ విషయాలు, పిల్లలు చదువులు ఏవో మాట్లాడుకునే వాళ్ళం. ఆరోగ్యరీత్యా యోగాలో చేరినా ఎందుకో రెగ్యులర్ వెళ్ళలేకపోతున్నాను. చాలా ఆలస్యంగా పడుకోవడం, వర్క్ టెన్షన్స్, క్యాంపులు నాజీవిత విధానం, అలవాట్లు కారణంగా! కాని తనని కలిశాక తనని చూడడానికి, మాట్లాడ్డం కోసమైన రోజు వెళ్ళాలనిపిస్తోంది. కాని మనసు మాట శరీరం వినాలికదా! ఇంకో పేజీలో... తనకి ప్రేమతో ధనూ అని పెట్టుకున్నాను. వెన్నెల పారిజాతంలా ఉంటుంది. దేవుడి ఫోటో దగ్గర పారిజాతాలు ఉంచి అగరుబత్తి వెలిగిస్తున్న ఆమె ముఖంలో ప్రశాంతత నాకు ఎంతో అద్భుతంగా అన్పించింది. ఇంకో చోట... ఇవాళ మా ఆఫీస్‌కి వచ్చింది ఏదో సంతకాలకని తనేదో ప్రాజెక్ట్ చేస్తోందట. నేను సర్టిఫై చేయాలట. చాలా సేపు మాట్లాడుకుంటూ ఉండిపోయాం. వెళ్ళిపోతోంటే తెలియని బాధ ఆవరించింది. నా బలాలు, బలహీనతలు, బాల్యం, అలవాట్లు అన్నీ తనకి చెప్పుకున్నాను. నా జీవితంలో తనో అందమైన పార్శ్వం తను ఎప్పుడైనా ఫోన్ చేస్తుంది. తనతో

మాట్లాడుతుంటే నాకెంతో ఉత్సాహంగా అన్పిస్తుంది మాటల్లో సౌమ్యత, ముఖంలో చిరునవ్వు, కళ్ళల్లో ప్రశాంతత ఎంతో ఆకర్షణీయంగా అన్పిస్తుంది. మా ఇద్దరి మధ్య ఎప్పట్నించో ఏదో బంధం ఉన్న ఫీలింగ్ అతిగా మాట్లాడదు. ఏం చెప్తున్నా ఇష్టంగా వింటుంది. మనసు వెలితిగా ఫీలయినా, టెన్షన్‌గా అన్పించినా, తనతో మాట్లాడాలని పదేపదే అన్పిస్తుంది. ఎందుకనో? జూన్ 12, ఈ మధ్య చాలా కాలంగా యోగాకి వెళ్ళడం కుదరడం లేదు. మధ్యలో ఫోన్ చేస్తూ ధనూతో మాట్లాడ్డం మాత్రం మానలేదు. ఒకసారి ఏదో పనిమీద ఆఫీస్‌కి తను వచ్చిందట కాని నేను లేను. తెలిశాక బాధ పడ్డాను. ఎందుకిలా అవుతోంది నాకు? తనంటే ఎందుకంత ఇష్టం? ఫోను చేసినప్పుడల్లా ఏదో విధంగా తన పట్ల నా ఫీలింగ్స్ వ్యక్తించేసేస్తూ ఉంటాను. ఏమన్పిస్తుందో కూడ మొహమాటం లేకుండా చెప్పేసినా తన నుంచి ఏ స్పందనా ఉండదు. టాపిక్ తెలివిగా మార్చేస్తుంది. ఆమె చమత్కారపు మాటలు, భావుకత, ప్రశాంతత, చైతన్యం, అందరితో మాట్లాడే తీరు నాకు ఎంతో ముచ్చటగా అన్పిస్తుంది. ప్రశంసించినా నవ్వేసి ఊర్కుంటుంది. ఒకసారి మాటల్లో తన టాలెంట్స్‌కి, ఎదుగుదలకి భర్తే కారణమని చెప్పింది. కొంచెం ఈర్ష్యనిపించినా సంతోషం వ్యక్తంచేశాను. ఎందుకంటే నేనెన్ని సార్లు నా మగతనం నిరూపించుకున్నా నా భార్య ఎప్పుడూ ఇంకా ఏవో అమర్చి పెట్టలేదని సాధిస్తూ అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. ఆ కోణంలో ఆమె భర్త ఎంత అదృష్టవంతుడు? అనుకున్నా ఆగష్టు 8 ధనూని చూడాలని వుంది కాని ఆరోగ్యం సహకరించడం లేదు. డాక్టర్లు టెస్ట్‌లు అంటున్నారు. తను ఈ మధ్యఫోన్ చేసినా నేను రెస్పాండ్ కాలేకపోతున్నాను. ఏమనుకుంటుందో? ధనూ చాలాసార్లు చెప్పింది. "శ్రీకర్ సిగరెట్స్, ఆల్కహాల్ మానేయండి," అని ఏంటో ఎడిక్ట్ అయిపోయాను. ధనూ నా జీవితంలో ఇంకొంచెం ముందు ప్రవేశించి ఉంటే తనమాట వినేవాణ్ణా...? ఏమో...? తను ఏంచెప్పినా నో అనాలన్పించదు.. ఒకసారి తనేమందో తెల్సా "శ్రీకర్ సిగరెట్ కాల్చాలన్పించినపుడల్లా మీ ప్రియమైన వారితో మాట్లాడండి" అని. నాకు ప్రియమైన వాళ్ళెవరో తనకి తెలియదా? ఆశ్చర్యం...! మా ఇద్దరికి ఏరకమైన పరిచయ వారధులు లేవు. ఎవరి నుంచి ఎవరికీ ఏ అబ్లిగేషన్స్ లేవు. కాని తనంటే నాకు చెప్పలేని ఇది! ఇలా సాగిపోయింది డైరీ అంతా!

భారంగా నిట్టూర్చాను. చదివిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చి అరుణ్‌కి వీలయినపుడు రమ్మని ఫోన్ చేశాను. నాలుగు రోజుల తర్వాత మధ్యాహ్నం 3 అవుతుంటే వచ్చాడు అరుణ్ " రా అరుణ్, భోజనం చేసావా? లైమ్ జ్యూస్ తీసుకో", అంటూ రెండు గ్లాసులతో వట్టుకొచ్చి డ్రాయింగ్ రూంలో కూర్చున్నాము" చదివారా ఆంటీ! ఇప్పుడు మీరే చెప్పండి మాడాడీ అలా చేయచ్చా? "సూటిగా అడిగాడు అరుణ్ మీడాడీ విషయం పక్కన పెట్టు" నీకో విషయం తెలుసా? ఆకర్షణ, అభిమానం, ప్రేమ కన్సర్న్, జాలి, దయ, ఇవన్నీ మనిషిలో ఉండే సహజాతాలు. కారణం తెలియకుండానే కొందరి మీద అభిమానం, మరికొందరి మీద ద్వేషం, చిరాకు కల్గుతాయి. ఎందుకంటే చెప్పలేం. కొందరు తమలో లేని వైఖరి ఇతరుల్లో కన్పిస్తే ఆకర్షింపబడతారు నా ఉద్దేశ్యం మీడాడీ ది రిజర్వ్‌డ్ నేచర్. బహుశా ఆయనకి కలివిడిగా ఉంటే నచ్చుతుందేమో?" "అవునాంటీ, డాడీ చాలా తక్కువగా మాట్లాడతారు. అలాగే నవ్వడం కూడా తక్కువే. అందుకే నాకు ఆశ్చర్యమన్పించింది ఇది చదువుతుంటే! అయినా ఆంటీ ఆయనేమైనా టీనేజరా నా అంత కొడుకుని పెట్టుకుని, మా అమ్మకి తెలిస్తే ఎంత బాధపడుతుంది? అమ్మలో కూడ ఇంచుమించు ఆ ధనూ గుణాలన్నీ ఉన్నాయి కదా!" అన్నాడు కించిత్ కినుకగా... అరుణ్ మాటలకి నాకు నవ్వొచ్చింది. "చూడు నాన్నా, తల్లి ఎలావున్నా పిల్లలకి ఆమె చాలా నచ్చుతుంది. కాని భర్తకి అన్ని యాస్పెక్ట్స్‌లో భార్య నచ్చాలని లేదు అలాగే భార్యకి కూడ భర్త! ఇకపోతే టీనేజరా అన్నావు? మనిషి మనసు ఎప్పుడు ఎవరి పట్ల ఎలా స్పందిస్తుందో ఎవరం చెప్పలేం! కొంతమంది బైటకి వ్యక్తం చేయకుండా మనసులో ఊహించుకుంటూ ఉంటారు. సమాజం, పరువు, ప్రతిష్ట ఎన్నో కారణాల వల్ల! మీ అమ్మగారి కంటే ధనూ బాగుండకపోవచ్చు. కాని కేవలం అందమే ఇక్కడ ప్రాధాన్యం కాదు కొంతమంది నవ్వు, నడత అవతలి వారిపట్ల చూపించే గౌరవం, కన్సర్న్, సరదాగా నవ్విస్తూ మాట్లాడే విధానం, కలుపుగోలుతనం, హావభావాలు ఏదైనా మనసుకి నచ్చవచ్చు. దాని గురించి అవతలి వాళ్ళు వివాహితులా? అవివాహితులా,? వయసులో ఉన్నారా? ముసలివాళ్ళా? అని ఆలోచించే పనిలేదు. కొతమంది ఏమాత్రం అందంగా లేకపోయినా కేవలం మాట తీరుతో అందర్నీ ఆకర్షించుకుంటారు. బహుశా మీ నాన్నగారికి ఫ్రెండ్స్ పరిమితమై వుండచ్చు. ఇంట్లో మీ మమ్మీతో ఆయన వేవ్ లెంగ్త్ కుదరకపోయి వుండవచ్చు ఆయన కోరుకున్న అంశాలు లక్షణాలు ధనూలో కన్పించడంతో స్నేహం చేసి ఉండవచ్చు. అదే ధనూ మగవాడయితే నీకు బాధన్పించేది కాదేమో. ఇదే మన సమాజ దౌర్భాగ్యం! అపోజిట్ సెక్స్ స్నేహంగా ఉంటే, వాళ్ళ పరిధుల్లో ఉన్నా అనుమానంగా చూసి అభాండాలు వేస్తారు. మీడాడీ ఏమీ లిమిట్స్ దాటలేదు కదా! కేవలం తన భావాల్ని, ఆలోచనల్ని అపురూపంగా డైరీలో వ్రాసుకున్నారు. ప్రతి మనిషికీ హృదయంలో సీక్రెట్ కార్నర్స్ ఉంటాయి. ఇది సైకాలజీ చెప్పే నిజం. అన్నింటిని అందరూ అందరితో పంచుకోలేరు! వాళ్ళ మనసే వాళ్ళకి అంతరంగిక స్నేహితుడు. స్వంత వాళ్ళకి చెప్పినా కొన్నిటిని ఎవరూ ఆమోదించలేరు. ఆమోదించకూడదు కూడా! ఫీలింగ్స్ అనేది నేచురల్ ఇన్‌స్టింక్ట్స్. ఎవరం నియంత్రించుకోలేనివి అవి. అయినా నీకోవిషయం చెప్పనా ఆశ్చర్యపడనంటే? "నామాటల ప్రభావం తన మీద చాలా బాగా కన్పిస్తోంటే అడిగాను నవ్వుగా, "ఏంటాంటీ? ఉత్సుకతగా అడిగాడు అరుణ్". ధనూ అంటే ధనశ్రీ. తను నాకు బాగా దగ్గర బంధువు. తను యోగాలో ఎందుకు చేరిందో తెలుసా? హార్ట్‌లో డిజార్డర్ వుంది. కాని తన గొప్పతనమేంటంటే తన బాధల్ని ఎవరికి చెప్పదు అందరి బాధలు వింటుంది. మీడాడీకి అన్పించినవన్నీ అందరికీ తనని చూస్తే అన్పిస్తాయి. కాని వ్యక్తం చేయరు. నాకు తనంటే చాలా ఇష్టం. తను ఎక్కడుంటే అక్కడ చైతన్యం ఉంటుంది. తనలా ఉండాలని ఎంతమంది అనుకుంటారో కాని తనే ఉండకుండా వెళ్ళిపోయింది". చివరి మాటలకి ఉలిక్కిపడ్డాడు. అరుణ్. "ఏంటాంటీ మీరనేది"? అవును అరుణ్! షీ ఈజ్ నో మోర్. మీడాడీ కంటే నెల రోజుల ముందు కార్డియాక్ అరెస్ట్ వల్ల చనిపోయింది. మంచివాళ్ళని, వాళ్ళని ఆరాధించే మంచివాళ్ళని దేవుడు ఎక్కువ కాలం ఉంచడుకదా! ఇప్పటికైనా మీ డాడీని అర్థం చేసుకుంటావుగా!" అన్నాను ఆర్తిగా. "ఓ ... నో...! నిజమా? ఐయామ్ వెరీ సారీ ఆంటీ, నేను చాలా ఇడియట్‌లా ప్రవర్తించాను. మీ వల్ల చాలా విషయాలు అర్థంచేసుకున్నాను. సంస్కారవంతుడిగా ఆలోచించడానికి మీ హెల్ప్ ఎప్పుడూ నాకుంటుంది. ఐలైక్యూ సోమచ్ ఆంటీ! మళ్ళీ కలుస్తాను. బై" అని వెళ్ళిపోయాడు. అరుణ్ వెళ్ళిన చాలా సేపటి వరకు అలాగే కూచుండిపోయాను నెమ్మదిగా లేచి టేబుల్ మీద వున్న నానోట్స్ అందుకున్నాను. దాని మీద రాసుకున్న 'డా, అనురాధ' పేరుని ఆప్యాయంగా తడిమాను. ఆరోజు శ్రీకర్ మాటలు గుర్తొచ్చాయి. "మీవారు అను అంటారు, ఫ్రెండ్స్ రాధ అంటారు మరి నేను? అందరూ పిలిచిన పేర్లతో పిలిస్తే నా ప్రత్యేకత ఏముంది? నిన్ను 'ధనూ' అని పిలవనా? నీపేరులోని అక్షరాలే!" దుఃఖం కట్టలు తెంచుకుంది శ్రీకర్‌ని తలచుకోగానే 'నన్ను ఇంతగా ఆరాధించావా శ్రీకర్? 'అరుణ్ మనసులో తండ్రి పట్ల గౌరవం చెక్కుచెదరకుండా ఉండడం కోసం శ్రీకర్‌తోపాటు ధనూని కూడా సజీవ సమాధి చేసేశాను. ఇంక ఆ పేరు అవసరం ఎప్పటికీ, ఎవరికీ రాదు 'ధనూ' శ్రీకర్‌తో శాశ్వతంగా వెళ్ళిపోయింది. ధనూశ్రీ నామరో రూపమని' అరుణ్‌కి ఎప్పటికీ తెలియదు.

ఎంత సైకాలజిస్ట్‌నయినా నేనూ సహజాతాలకి అతీతురాల్ని కానుగా! అనుకుంటూ భారంగా నిట్టూర్చాను.